సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

జనగామ, బచ్చన్నపేటలో ప్రభుత్వాస్పత్రుల తనిఖీ



ఎంసీహెచ్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో, కలెక్టర్


జనగామ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు అన్నారు. జనగామ మండలంలోని పసరమండ్ల శివారులోని ఎంసీహెచ్‌ను వాసం వెంకటేశ్వర్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఓపీ, చిన్న పిల్లల వార్డులను పరిశీలించి టైంకు వైద్యులు మందులు ఇస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండటమే కాకుండా అవగాహన కలిగి ఉండటం కూడా ప్రధాన్యమన్నారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని, మందుల నిల్వలు (మిగతా 8వ పేజీలో)

తేలిన ఓటర్ల లెక్క

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్



- ఓటరు తుది జాబితా విడుదల
- మూడు నియోజకవర్గాల్లో 7,67,426 ఓటర్లు
- పురుషులు 3,77,953, మహిళలు 3,89,443, ఇతరులు 30 మంది..
- కొత్తగా చేరిన 5,784 మంది ఓటర్లు..
- మరో 61 కొత్త పోలింగ్ స్టేషన్లకు ప్రతిపాదనలు
- తుది జాబితాను వెల్లడించిన కలెక్టర్



జనగామ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా పరిధిలోని మూడు నియోజకవర్గాల ఓటర్ల లెక్క తేలింది. ప్రత్యేక సార్వత్రిక సవరణ(ఎస్ఎస్ఆర్-2025)కు సంబంధించిన ఓటరు తుది జాబితాను జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం ప్రకటించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక సార్వత్రిక సవరణ-2025, త్వరలో చేపట్టబోయే ప్రత్యేక సమగ్ర సవరణ-2026కు సంబంధించిన అంశాలపై ఎన్నికల విభాగం అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ప్రత్యేక సార్వత్రిక సవరణ ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. గత ఏడాది అక్టోబరు 29 వరకు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో 7,57,982 మంది ఓటర్లు ఉండగా ఈఏడాది జనవరి 6 నాటికి మూడు నియోజకవర్గాల్లోని ఓటర్ల సంఖ్య 3,660 పెరిగి 7,61,642కు చేరింది. జిల్లాలో ఓటరు జాబితా కచ్చితత్వం, సమగ్రత, పారదర్శకతను కాపాడేందుకు ప్రత్యేక సార్వత్రిక సవరణ-2025 కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారంతో ఈ కార్యక్రమం పూర్తవగా మూడు నియోజకవర్గాల్లో 5,784 మంది ఓటర్లు పెరిగారు. దీంతో మూడు నియోజకవర్గాలోని మొత్తం ఓటర్ల సంఖ్య 7,67,426కు చేరింది. ఇందులో పురుషులు 3,77,953(49.25శాతం), మహిళలు 3,89,443 (50.75 శాతం), ఇతరులు 30 (0.01 శాతం) మంది ఉన్నారు. కాగా,జూలై 25 వరకు జనగామ నియోజకవర్గంలో 2,48,245, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 2,59,095, పాలకుర్తి నియోజకవర్గంలో 2,58,315 మంది ఓటర్లు ఉన్నారు.

జనవరి 6 నుంచి జూలై 25 వరకు ఓటర్లు

నియోజకవర్గం	పెరిగిన ఓటర్లు	మొత్తం ఓటర్లు
జనగామ	2,275	2,48,245
స్టేషన్‌ఘన్‌పూర్	1,738	2,59,095
పాలకుర్తి	1,771	2,60,086
మొత్తం	5,784	7,67,426

మరో 61 కొత్త పోలింగ్ కేంద్రాలు

పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నచోట అదనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1,200కు మించరాదని పేర్కొంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో 61 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య 1,200కి మించిందని అధికారులు గుర్తించారు. ఈ మేరకు అక్కడ 61 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో (మిగతా 8వ పేజీలో)

పోలింగ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పెరిగేవి	మొత్తం
జనగామ	277	25	302
స్టేషన్‌ఘన్‌పూర్	290	19	309
పాలకుర్తి	294	17	311
మొత్తం	861	61	922

యూరియా కొరత లేదు



పటేల్‌గూడెం యూరియా నిల్వలను పరిశీలిస్తున్న జేడీఏ

లింగాలఘణపురం, జూలై25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని అన్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వ్యవసాయ కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి బండ్లగూడెం రైతు వేదిక ద్వారా జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని వీక్షించారు. కార్యక్రమంలో ఏడీఏ వసంత, ఏవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- పటేల్‌గూడెం ఆగ్రోస్ సేవాకేంద్రాన్ని వ్యవసాయ శాఖ కమీషనర్ కార్యాలయ జేడీఏ బాలునాయక్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు ఉదయం 8 గంటల నుంచే అందుబాటులో ఉండాలన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయాలి

- రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గోపి

బచ్చన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ఊరూరా చాకలి ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి, నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఏదునూరి గట్టేశం అన్నారు. శుక్రవారం కేశిరెడ్డిపల్లిలో జరిగిన సమావేశంలో సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. రజకులు తమ హక్కుల సాధన కోసం ఒక్కతాటిపై నడవాలన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలపై వీరోచితంగా పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాలను ఊరూరా నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో నేతలు మామిడాల ప్రభాకర్. మామిడాల లక్ష్మయ్య, మినలాపురం జలంధర్, జిల్లా అధ్యక్షుడు ఏదునూరి నరేష్, మండల అధ్యక్షుడు ఆరెల్లి భాస్కర్, వీరన్న, యుగేందర్, యాకలక్ష్మీ, చెన్నయ్య, రాజు, యాకన్న, రాములు, కిష్టయ్య పాల్గొన్నారు.

పలుచోట్ల మోస్తరు వర్షం

జనగామ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు నర్మెట, జఫర్‌ఘడ్, తాటికొండ, గుడూర్, మల్కాపూర్ గ్రామాల్లో శుక్రవారం వర్షం దంచికొట్టగా పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. వర్షం కారణంగా జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా, హైదరాబాద్ రోడ్డులో వర్షపు నీరంతా రోడ్డుపైకి వచ్చి చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. నర్మెట మండల కుంద్రంలో 24.3 మి.మీ, జఫర్‌ఘడ్ మండల కేంద్రంలో 22.5 మి.మీ, స్టేషన్ ఘనపూర్ తాటికొండలో 21.8 మి.మీ, పాలకుర్తి గుడూర్‌లో 21.3 మి.మీ, చిల్పూర్ మండలం మల్కాపూర్‌లో 20.3 మి.మీ, తరిగొప్పుల అబ్దుల్ నాగారంలో 16.3 మి.మీ, జఫర్‌ఘడ్ మండంలోని కునూర్‌లో 14.0 మి.మీ,వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 11.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

జనగామకు ప్రత్యేక ఆకర్షణ
బతుకమ్మకుంట
- 27న లైసెన్స్ సర్వేయర్ల అర్హత పరీక్ష
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

8లో

శ్రావణం..
శుభకరం..
- ఇక అన్నీ మంచి రోజులే..
- ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు
- మోగనున్న పెళ్లి బాజాలు

మత్స్యకారులు సంఘటితం కావాలి

జఫర్‌గడ్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు సంఘటితం కావాలని రఘునాథ్‌పల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మట్టెపల్లి బుచ్చయ్య, ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు అన్నెపు రమేశ్ కోరారు. శుక్రవారం రఘునాథ్‌పల్లిలో మత్స్యకారుల మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురయ్యారన్నారు. ప్రభుత్వ పథకాలను ముదిరాజ్‌లు, మత్స్యకారులకు వర్తింపజేసి ఆదుకోవాలన్నారు. 26న పాలకుర్తిలో జరిగే మత్స్యకారులు, మత్స్యకార్మికుల జిల్లా స్థాయి మూడవ మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ఆగయ్య, ఎల్లయ్య, రాజయ్య, అచ్చయ్య, వెంకటేశ్, సంతోష్ పాల్గొన్నారు.



రఘునాథపల్లిలో కరపత్రాల ఆవిష్కరణ

- పాలకుర్తి(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శుభం గార్డెన్‌లో శనివారం జరిగే మత్స్య కార్మిక సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల తర్వాత ఉద్యమాల పురిటి గడ్డ పాలకుర్తిలో మత్స్యకార్మి జిల్లా మహసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పాలకుర్తి మాజీ ఉపసర్పంచు తరాల చంద్రబాబు ఉన్నారు.

రఘునాథపల్లిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు, ఆకు కూరలు



ధరదడ!

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- కిలో రూ.వంద పలుకుతున్న మిర్చి
- కిలో రూ.80కి చేరిన క్యాప్సికం
- ఆకు కూరలూ పిరమయ్యాయి..

రఘునాథపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. పచ్చిమిర్చి, ఉల్లి ధరలు కన్నీరు తెప్పిస్తున్నాయి. కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. వర్షాభావ పరిస్థితులు, కోతుల బెడద పెరగడంతో జిల్లాలో కూరగాయల సాగు తగ్గుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వినియోగదారుల డిమాండ్‌ల కనుగుణంగా హైదరాబాద్, భువనగిరి, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి కూగాయలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. టమాటా, కాకరకాయ, పచ్చిమిర్చి, బీరకాయ, బీనిస్ తదితర కూరగాయల ధరలు బాగా పెరిగాయి. టమాటా ధరలు వింతగా ఉంటాయి. వాటి సీజన్ బట్టి అతి తక్కువ ధరల నుంచి అతి ఎక్కువ ధరలకు పెరుగుతుంటాయి. కొద్ది నెలల క్రితం కిలో రూ.30 పలికిన ధర ప్రస్తుతం రూ.50కి చేరుకుంది. కిలో పచ్చిమిర్చి ధర రూ.100 పలుకుతోంది. బీరకాయ కిలోకు రూ.50 చేరడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వారాంతపు సంతల్లోనూ ధరలు మండుతున్నాయి. ప్రస్తుతం క్యాప్సికం కిలో ధర రూ.80 చేరింది. ఇంటి ముందు పందిరిపై చిక్కుడు చెట్టును పెంచడంతో ఆ చుట్టు పక్కల ఇళ్లకు సరిపడా చిక్కుడు కాయలు కాసేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితులు కనుమరు గయ్యాయి. దీంతో చిక్కుడు కూడా ధర పెరిగిం ది. కిలో రూ.60 పలుకుతోంది. దుంపల విష యానికి వస్తే అలుగడ్డ, చేమగడ్డ, క్యారెట్, బీట్ రూట్ కిలోకు రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలుకుతుంది. బెండకాయ, దొండకాయ, సోరకా య, దోస, క్యాబేజీ తదితర కూరగాయలు మా త్రం రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకు తుంది. వీటిని చూసిన వినియోగదారులు మా త్రం పరవాలేదంటూ కొనుగోలు చేస్తున్నారు.

పిరమైన ఆకు కూరలు..

వర్షాభావ పరిస్థితులతో ఆకు కూరలు కుడా పిరమయ్యాయి. పాల కూర, తోట కూర, చిన్నకుల కూర, చుక్క కూర ధరలు సైతం పెరిగాయి. రూ.10కి ఒక కట్ట, రూ.20కి మూడు కట్టలు అమ్ముతున్నారు. కొత్తిమీర, పుదీనా కిలో రూ.90కి చేరింది. గతంలో రోజుకు 60 నుంచి 70 కట్టలు విక్రయించే వ్యాపారులు ఇప్పుడు 20 నుంచి 30 కట్టలకు మాత్రమే పరిమితమయ్యారు. ధర ఎక్కువగా ఉండడంతో నిల్వ ఉంచితే ఆకు కూరలు పాడై పోతాయనే భయంతో తక్కువ మొత్తంలోనే తెచ్చి అమ్ముతున్నారు.

రూ.3.59 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

ఫోన్ హ్యాక్ చేసి.. సిమ్, ఆధార్ కార్డు బ్లాక్ చేసిన వైనం

మరిపెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరిపెడ బంగ్లాకు చెందిన ఓ వ్యాపారి ఫోన్ హ్యాక్ చేసి.. సిమ్, ఆధార్ కార్డులను బ్లాక్ చేసి ఆయన బ్యాంకు అకౌంట్‌లోని రూ.3.59లక్షలు కొట్టేశారు. వీరభద్ర ఏజెన్సీకి చెందిన తాడూరి వీరన్నను సైబర్ నేరగాళ్లు ఓ అమ్మాయిని ఎరగా చూపి ఫోన్ హ్యాక్ చేశారు. సిమ్, ఆధార్ కార్డును గత పక్షం రోజుల కిందట జూలై 11న బ్లాక్ చేశారు. వీరన్న అకౌంట్‌లోని రూ.3.59లక్షలు సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. సిమ్, ఆధార్ కార్డులు సైతం బ్లాక్ కావడంతో ఆయన ఫోన్ పని చేయడం లేదు. టెలికాం సంస్థలకు చెందిన ఏజెన్సీ నిర్వాహకులను, ఆధార్ ఏజెన్సీ నిర్వాహకులను కలిసి బ్లాక్ అయిన సిమ్, ఆధార్ కార్డును సరి చేసుకున్నాడు. ఆయన అకౌంట్‌లో డబ్బులు లేక పోవడంతో తాను సైబర్ నేరగాళ్లతో మోసం పోయానని లబోదిబోమంటూ గురువారం మరిపెడ పోలీసులను ఆశ్రయించారు. 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి మోసం విషయం వారికి తెలిపారు. ఘటనపై మరిపెడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డిమందు తాగి మహిళ ఆత్మహత్య

డోర్నకల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ మహిళ మనస్తాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కస్నాతండా గ్రామపంచాయతీ శివారు గన్యతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం. గన్యతండాకు చెందిన బానోత్ పద్మ (48) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. పద్మ గత కొంతకాలంగా మద్యానికి బానిసకావడంతో మానసికంగా ఇబ్బందులు పడుతూ ఉండేది. ఈ నెల 23న ఇంటివద్ద ఎవరు లేని సమయంలో గడ్డిమందు తాగింది. కుటుంబసభ్యులు 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఏంజీఎంకు తరలిస్తుండగా పద్మ మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. మృతురాలు పద్మ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీరుసీసాతో ఆర్టీసీ బస్సుపై దాడి

● డ్రైవర్, కండక్టర్‌కు గాయాలు

డోర్నకల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగిన ఓ యువకుడు ఆకతాయి తనంతో డోర్నకల్‌కు వచ్చే ఆర్టీసీ బస్సుపై బీరుసీసాతో దాడి చేసినట్లు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద గల సీతారామప్రాజెక్టు నిర్మాణం ప్రాంతంలో ఓ యువకుడు తాను తాగిన బీరు మద్యం బాటిల్ డోర్నకల్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సుపైకి విసిరాడు. ఈ ఘటనలో బస్సు ముందుభాగం అద్దంపగిలి డ్రైవర్, కండక్టర్‌లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు యువకుడిని పట్టుకునే ప్రయత్నం చేయగా అతడు ద్విచక్రవాహనంపై పారిపోయాడు. ఘటనపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్, కండక్టర్‌లు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ దమ్ము చక్రాల కింద పడి డ్రైవర్ మృతి



శేషు(ఫైల్)

మంగపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) పొలంలో భూమిని ట్రాక్టర్ దమ్ము చక్రాలతో చదును చేస్తూ, ప్రమాదవశాత్తు కేజీవీల్స్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామ రైతులు, స్థానిక ఎస్సై టీవీఆర్. సూరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేటకు చెందిన దీకొండ యాకాంతం(లేట్)- వెంకట లక్ష్మి దంపతుల రెండో కుమారుడైన దీకొండ శేషు(27) అనే అవివాహితుడు ఉన్నాడు. గ్రామ శివారులో బుచ్చంపేటకు చెందిన రాచకొండ మల్లయ్య అనే రైతుకు చెందిన పొలంలో కేజీవీల్స్ ట్రాక్టర్‌తో శుక్రవారం పొలం దున్నుతున్నాడు.

ఈక్రమంలో అకస్మాత్తుగా ఫిట్స్(మూర్ఛ) వచ్చి ట్రాక్టర్ నుంచి పక్కనే ఉన్న కాలువలో పడి తలమీద దమ్ముచక్రాల కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఎడమ కంటి నుంచి తల వరకు తీవ్ర గాయాలై కాలువలో నీళ్లు ఉండడంతో పాటు ట్రాక్టర్ శరీరంపై ఉంది. దీంతో ఊపిరాడక శేషు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు దీకొండ నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి తల్లి వెంకట లక్ష్మి ఉన్నారు. శేషు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఆక్టోపస్-పోలీస్ మాక్‌డ్రిల్

● జీఎం కార్యాలయాన్ని చుట్టుముట్టిన భద్రతా దళాలు

● ఉగ్ర, తీవ్రవాదుల దాడులను తిప్పికొట్టుటపై విన్యాసాలు



జీఎం కార్యాలయంలో మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ భద్రతా దళాలు

కృష్ణకాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాకేంద్రంలో ఆక్టోపస్ మాక్‌డ్రిక్ కార్యక్రమం చేపట్టింది. భూపాలపల్లి పోలీసు, ఆక్టోపస్ సంయుక్తంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సింగరేణి జీఎం కార్యాలయాన్ని ఆక్టోపస్, పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని కట్టడి చేశారు. ఉగ్రవాదులు గానీ, తీవ్రవాదులు గానీ దాడి చేస్తే ఎలా తిప్పికొట్టాలనే అంశంపై విన్యాసాలు చేశారు. జీఎం కార్యాలయంతో పాటు పక్కనే ఉన్న సింగరేణి కార్యాలయాలన్నింటిని ఆక్టోపస్ భద్రతా దళాలు, పోలీసులు సుమారు 60 మంది చుట్టుముట్టారు. వారు చేస్తున్న చర్యలను చూసిన ప్రజానీకం ఏం జరిగిందోనని ఒకింత హైరానా పడ్డారు. ఈ సందర్భంగా భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ తీవ్ర, ఉగ్రవాదులు దాడి చేస్తే ఎలా తిప్పికొట్టాలో ప్రజలను అప్రమత్తం చేయడంలో భాగంగా ఈ మాక్‌డ్రిల్ చేపట్టినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా తెలంగాణ పోలీస్ సమర్థవంతంగా తిప్పికొట్టుటకు సిద్ధంగా ఉందని, ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలుపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ వీరరాజు, ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, మిగతా ఆక్టోపస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

దివ్యాంగులకు వైకల్యం అడ్డురావొద్దు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో అద్భుతమైన ప్రతిభ ఉంటుందని.. వారికి అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తారని భూపాలపల్లి జిల్లా కలెకర్ రాహుల్‌శర్మ స్పష్టం చేశారు. శుక్రవారం భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారిత విభాగం ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్-2025ను స్థానికంగా ఉన్న సింగరేణి మినీ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, పథకాల ద్వారా దివ్యాంగుల ప్రతిభకు తగిన గుర్తింపువస్తుందన్నారు. జిల్లాలో మొదటి సారి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామం అన్నారు. దివ్యాంగులకు ఉన్న పథకాలను మారుమూల గ్రామ స్థాయికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 18 ఎన్‌జీవోల స్టాళ్లను ఏర్పాటు చేయగా కలెక్టర్ వాటిని పరిశీలించి ఆశ్చర్యపోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, జిల్లా ఇన్‌ఛార్జీ సంక్షేమాధికారిని మల్లీశ్వరి, డాక్టర్ బీవీ రామ్‌కుమార్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ములుగు కలెక్టర్ దంపతులు

భద్రకాళి ఆలయంలో ములుగు కలెక్టర్ దంపతుల పూజలు

వరంగల్ కల్చరల్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరంలోని చరిత్ర ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ములుగు కలెక్టర్ దివాకర్ కుటుంబ సభ్యులతో సహా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ధర్మకర్తలు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. అర్చకులు కలెక్టర్ దంపతులకు ఆశీర్వచనం అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు ఇస్సిపేటకు కేటీఆర్ రాక

మొగుళ్లపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈ నెల 27వతేదీన మండలంలోని ఇస్సిపేట గ్రామానికి రానున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇస్సిపేట మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య గత ఏడాదిక్రితం అనారోగ్యంతో మృతిచెందారని, గ్రామ శివారులో కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని అన్నారు. కేటీఆర్ పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరుగుతుందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, చిట్యాల మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కడారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం వద్ద గోదావరి మట్టం

బొగతకు తగ్గిన వరద ఉధృతి

వాజేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నయాగరా బొగత జలపాతం సాధరణ స్థితికి చేరుకుంది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జలపాతానికి వరద నీరు పోటెత్తడంతో ఉగ్రరూపం దాల్చింది. శుక్రవారం తేలికపాటి వర్షాలు కురవడంతో జలపాతం వరద నీటి ప్రవాహం తగ్గింది. భారీ వర్షాలకు జలపాతం ముందు భాగంలో ఉన్న రక్షణ కంచే, రాతిబండలు కొట్టుకుపోవడంతో ఫారెస్టు అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. కాగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఫారెస్టు అధికారులు 26వ తేదీ వరకు జలపాత సందర్శనను నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో మరిన్ని రోజులు సందర్శనను నిలిపివేసే అవకాశం లేకపోలేదు. కాగా జలపాతం తెల్లటి జలధారలతో ఆకట్టుకుంటుంది.



ఆకట్టుకుంటున్న బొగత అందాలు

పెరిగిన గోదావరి నీటి మట్టం

మహదేవపూర్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమం వద్ద గోదావరి 9 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. ఎగువన మహారాష్ట్రలో భారీ ఎత్తున వర్షాలు కురవడంతో పాటు తెలంగాణలో మూ డు రోజుల పాటు వర్షం కురుస్తుండడంతో పెద్ద ఎత్తున గోదావరిలోకి వరద నీరు చేరింది. రేపటి వరకు గోదావరి మట్టం పెరుగనుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం బ్యారే జీకి వచ్చే ఇన్‌ఫ్లో 3.41లక్షల క్యూసెక్కులుగా నమోదుకాగా గేట్లన్ని ఓపెన్ చేసి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి నది 4.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

న్యూసైన్స్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

జెన్‌పాక్ట్ కంపెనీలో నియామకాల కోసం నిర్వహణ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు

హనుమకొండ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్ రోడ్డులోని న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి ఆధ్వర్యంలో జెన్‌పాక్ట్ కంపెనీలో నియామకాల కోసం శుక్రవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 242 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల డైరెక్టర్ కె.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్ మొదటి రౌండ్‌లో పర్సనల్ ఇంటర్వ్యూ, రెండో రౌండ్‌లో ఆపరేషన్ నిర్వహించగా మొత్తం 56మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేశం, సీహెచ్ కమలాకర్‌లు అభినందించారు. కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కంప్యూటర్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పట్టు సాధించాలని, వీటి కోసం తమ కళాశాలలో ప్రత్యేకంగా ఉచిత ట్రైనింగ్ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రావణ్ కుమార్, వి.మధుకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అహ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ సూచించారు. పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క. శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, డైరెక్టర్ సృజనలతో కలిసి కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగామ కలెక్టరేట్ కార్యాలయం నుంచి పింకేశ్ కుమార్, జడ్పీ సీఈవో మాధురిషాతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రతీ రోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. చెత్తాచెదారం తొలగిస్తూ, వనమోత్సవాన్ని చేపట్టి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వసతి గృహాలు, పాఠశాలు, వైద్యశాలల్లో పర్యవేక్షణలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో డీపీవో స్వరూప, డీఎంహెచ్‌వో మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, అధికారులు

విద్యుదాఘాతంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

నర్మెట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో విద్యుత్ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం మల్కాపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మల్కాపేటకు చెందిన బానోతు రాజు(30) కరెంట్ డిపార్ట్‌మెంట్‌లో ఔట్‌సోర్సింగ్ కట్టర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని దొంగలచెలిమెతండాలో 11కేవీ విద్యుత్ పోల్ ఎక్కి డీటీఆర్ ఫీజు వైరు చుడుతుండగా ప్రమాదవశాత్తు ఫ్యూస్ వైర్ నుంచి ఎడమ చేతికి విద్యుత్ షాక్ తగలడంతో కరెంట్ పోల్ నుంచి కింద ఉన్న మోరీ గద్దెపై పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య నీల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటరెడ్డి తెలిపారు.



తొర్రూరులో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కొత్త పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

తొర్రూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన కొత్త పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం తొర్రూరులో తెలంగాణ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజయ్య, కె.వెంకటాచారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది సామాజిక భద్రత అని, శ్రమనే పెట్టుబడిగా పెట్టి జీతం డబ్బులతో గడిపే ఉద్యోగులు వయసు పైబడటం వల్ల ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పేదరికంలోకి వెళ్లకుండా పెన్షన్ కాపాడుతుందన్నారు. పెన్షనర్‌లకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశంలో బిల్లులు ప్రవేశపెట్టారని, దీనిద్వారా కొత్త పీఆర్సీ, డీఏ ప్రయోజనాలకు పెన్షనర్‌లకు లేకుండా పోతున్నాయన్నారు. వెంటనే కొత్త పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, యాకూబ్, అమీర్, సురేష్, నారాయణ, నాగేశ్వర్‌రావు, చంద్రప్రకాశ్, మనోహర్ రాజు, బిక్షపతి, చంద్రశేఖరాచారి తదితరులు ఉన్నారు.

బాలికలను లైంగికంగా వేధించిన వృద్ధుడి అరెస్టు

పాలకుర్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల బాలికను లైంగిక వేధింపులకు పాల్పడిన వృద్ధుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య తెలిపారు. శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ జానకీరాంరెడ్డితో కలిసి ఏసీపీ ఘటన వివరాలను వెల్లడించారు. తీగారంనకు చెందిన పోగు సోమయ్య అనే వృద్ధుడు ఓ గ్రామానికి చెందిన బాలికలను ఈనెల 22న లైంగిక వేధింపులకు గురిచేశాడు. బిస్కెట్లు, డబ్బుల ఆశ చూపి అఘాయిత్యాలకు పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు విచారణ చేపట్టినట్లు తెలిపారు. సదరు వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వాగు దాటి వైద్య సేవలు

ఏటూరునాగారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్ల జంపన్న వాగు మీదుగా పడవలో చేరుకుని, అక్కడి నుంచి మల్యాల, కొండాయి గ్రామాలకు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అయితే, శుక్రవారం కొండాయి వైద్య అధికారి డాక్టర్ హెచ్. ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో మల్యాల గ్రామంలోని ఏయూపీఎస్ పాఠశాలలో ఈ ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు 45 మందికి మందులు పంపిణీ చేశారు. కాగా, ఇద్దరికి మలేరియా పరీక్షలు చేయగా, నెగిటివ్ వచ్చాయని తెలిపారు. వారికి అవసరమైన మందులను అందజేసి, ప్రజలు ఆహారం, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమ తెరలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. అలాగే, కాచి చల్లార్చిన నీటిని తాగమని అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, హెచ్ఎం శేషయ్య, ఆశ కార్యకర్తలు జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మల్యాలలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రణీత్

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2645	1521
పల్లికాయ (సూక)	5670	3450
పల్లికాయ (పచ్చిది)	4750	1575
కందులు	6232	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7810	5300
పసుపు (కాడి)	10322	9534
పసుపు (గోల)	9459	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	13300	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	13200	11500
యూఎస్341ఏసీ	12800	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

శుభకరం.. శ్రావణమాసం..

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు ప్రారంభం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- వేయిస్తంభాల ఆలయంలో లక్ష తులసీ అర్చన


రుద్రేశ్వరాలయంలో తులసీ అర్చన నిర్వహిస్తున్న అర్చకులు


రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు


కరెన్సీ దండల అలంకరణలో సంతోషిమాత

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈసారి వారం రోజుల ముందే శ్రావణ సందడి ఆరంభమైంది. శ్రావణ తొలిరోజు శుక్రవారం కావడంతో అన్ని ఆలయాల్లో భక్తుల తాకిడి పెరగడంతోపాటు ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఒక పక్క వర్షం పడుతున్నా భక్తి శ్రద్ధలతో ఆలయాలకు చేరుకొని వేడుకల్లో పాల్గొన్నారు. ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరింపజేసి వేడుకలను ఆరంభించారు. రాజరాజేశ్వరి ఆలయంలో శ్రావణవ్రతాలు సందడిగా ప్రారంభం అయ్యాయి. చారిత్రక హనుమకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో భక్తుల కోలాహలం మధ్య శ్రావణ వేడుకలు ప్రారంభం అయ్యాయి. మహాలక్ష్మీ ప్రీతికర శుక్రవారం రోజు శ్రావణమాస ప్రారంభవేళ రుద్రేశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, సందీప్ శర్మల ఆధ్వర్యంలో లక్ష తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. ప్రముఖ శివభక్తుడు గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు, ఉమారాణి దంపతుల సౌజన్యంతో లక్ష నామాలతో తులసీ అర్చనను ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు గట్టు మహేశ్‌బాబుతోపాటు అనేక మంది వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులు తొలినాటి శ్రావణ వేడుకల్లో పాల్గొన్నారు.

హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరాల్లోని మార్వాడీ మహిళలు సుమారు 200 మంది లష్కర్‌బజార్ రాంమందిర్ నుంచి ఊరేగింపుగా శివనామ స్మరణతో బాజా భజంత్రీలను గంగాజల కావడిలను భుజంపై ధరించి ఊరేగింపుగా వేయిస్తంభాల ఆలయానికి చేరుకొని కావడి పూజ నిర్వహించుకున్నారు. ఆలయ నాట్యమండపంలో శ్రావ్యంగా భక్తి పాటలతో సందడి చేస్తూ ఆధ్యాతికతను గుబాళింపజేశారు.

హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో శ్రావణ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సిద్దేశుని సురేశ్, రవికుమార్ ఆధ్వర్యంలో సిద్ధేశుడి పాడ్యమి తిథిని పురస్కరించుకొని అమర్‌నాథుడిగా ప్రత్యేకంగా అలంకరింపజేసి పూజలు నిర్వహించారు. హనుమకొండ అదాలత్ వెంకటేశ్వరాలయం, రెవెన్యూ రామాలయం, శ్రీరంగనాథుడి పెద్ద కోవెలలో శ్రావణ వేడుకలు ప్రారంభం అయ్యాయి.

కిటకిటలాడిన దేవాలయాలు

శ్రావణ మాసం వేడుకలను పురస్కరించుకొని వరంగల్ హంటర్‌రోడ్డులోని శ్రీసంతోషిమాత దేవాలయంలో అమ్మవారిని కరెన్సీ దండలతో అలంకరించారు. ములుగురోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో అర్చకుడు రాపాక గోపీకృష్ణశర్మ ఆధ్వర్యంలో శ్రావణ మాసోత్సవాలు నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకం, పూజలు, అలంకరణ జరిపించారు. సామూహికంగా వరలక్ష్మి వ్రతాలను ఆచరింప చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవీ మాత దేవాలయం, శివనగర్‌లోని లలితామాత దేవాలయం, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం, దుర్గేశ్వర, రామలింగేశ్వర, భోగేశ్వర, ఆకారపువారి గుడి, కాశిబుగ్గ శివాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీలలితా సహస్ర పారాయణాలు, దివ్యనామ సంకీర్తలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల అన్నప్రసాదాలు అందించారు.


రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

క్రీడా స్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా పోటీ పడాలి..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- ఆఫీసర్స్ క్లబ్‌లో మూడు రోజులు పాటు క్రీడలు
- హాజరైన 250మంది షట్లర్లు, కోచ్‌లు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా క్రీడల్లో పోటీ పడాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చన్నారు. తను స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడినని, ఎన్నో టోర్నమెంట్లలో పాల్గొన్నారన్నారు. ఈ క్రమంలో తన భుజానికి గాయం కావడంతో బ్యాడ్మింటన్ క్రీడకు దూరం కావాల్సి వచ్చిందన్నారు. వ్యాయామంలో భాగంగా ప్రతీరోజు టెన్నిస్, క్వాష్ క్రీడల్లో సాధన చేస్తున్నానన్నారు. మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీపీ(ఎస్‌బీ) మూల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సింగిల్స్, డబుల్స్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ టోర్నీలో 20 జిల్లాల నుంచి 250మంది క్రీడాకారులతో పాటు 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, అంపైర్లు పాల్గొన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వీసీ డాక్టర్ టి. యాదగిరిరావు, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము రాజేందర్, కోశాధికారి నాగ కిషన్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, ఆఫీసర్స్ క్లబ్ ఇంచార్జీ కార్యదర్శి బి.కన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మిక్స్‌డ్ డబుల్స్‌లో తలపడుతున్న షట్లర్లు

భద్రకాళి ఆలయంలో శ్రావణ పూజలు


అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న ములుగు కలెక్టర్ దంపతులు

వరంగల్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాసం పూజలు జరిగాయి. నెల రోజుల పాటు కొనసాగే వేడుకల్లో భాగంగా అమ్మవారికి నిత్య పూజ, నిత్య అర్చన నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు.

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ధర్మకర్తలు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతితో పాటు చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్‌రెడ్డి, గాండ్ల స్రవంతి, ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగుల ఆంజనేయులు, బింగి సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోగనున్న పెళ్లిభాజా

నేటి నుంచి శుభ ముహూర్తాలు



వెంకటాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆషాడం ముగిసింది. శుక్రవారం శ్రావణ మాసం ప్రారంభమైంది ఈ మాసం వస్తూవస్తూ ఎన్నో శుభ ముహూర్తాలను తెచ్చింది. సూమారు రెండు నెలలుగా శుభ ముహూర్తాలు లేకపోవడంతో పెళ్ళిళ్ళు నిలిచిపోయాయి. దీంతో శ్రావణమాసం ఎప్పుడొస్తుందా అని చాలా మంది వేచి చూశారు. ఈ నెల 26, 30, 31, తేదీలతో పాటు వచ్చే నెల 1 , 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీలో వేలాది పెళ్లిళ్ళు జరుగనున్నాయని పండితులు పేర్కొన్నారు. ఆ తర్వాత భాద్రపద మాసంలో శుభముహూర్తాలు ఉండవని, సెప్టెంబరు నాలుగో వారం నుంచి నవంబర్ చివరి వరకు వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు ఉంటాయని చెబుతున్నారు. ఇప్పటికే చాలా మంది పెళ్ళిళ్ళ, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు నిశ్చయించుకున్నారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో అంతటా పెళ్ళి కళ కనిపిస్తోంది. వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. అయితే ముహూర్తాల సమయంలో బంగారం ధరలు మరింత పెరగడంతో కొనుగోలుదారులను ఆందోళనకు గురి చేస్తోంది.


అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభ

భూ సేకరణకు సహకరించాలి


- గాడిపల్లి గ్రామసభలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- బాధితులకు నష్టపరిహారం ప్రకటించిన అధికారులు
- అసంతృప్తి వ్యక్తం చేసిన భూ బాధితులు

మామునూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి కోరారు. మామునూరు మండలం గాడిపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె రైతులతో మాట్లాడారు. ఇండ్లు కోల్పోయిన వారికి భూ చట్టం ప్రకారం కలెక్టర్ సత్యశారద ఒక రేటు నిర్ణయించారని, ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఇండ్లు కోల్పోతున్న 20మంది నిర్వాసిత కుటుంబాలను గుర్తించారని, చట్ట ప్రకారం నష్టపరిహారాన్ని అందజేస్తామని అన్నారు. 2013 భూచట్టం ప్రకారం జనరల్ స్కీం కింద (ల్యాండ్ ఆక్యూపేషన్, వన్ టైం రీ సెటిల్‌మెంట్, షిఫ్టింగ్ ట్రాన్స్‌పోర్ చార్జెస్, 12 నెలల రెంట్ అలవెన్స్) మొత్తం కలిపి రూ.7లక్షల86 వేలు అందజేస్తారని, 2016 చట్టం ప్రకారం కాన్సెంట్ స్కీం కింద (ల్యాండ్ ఆక్యూపేషన్, వన్ టైం రీ సెటిల్‌మెంట్, షిఫ్టింగ్ ట్రాన్స్‌పోర్ చార్జెస్, 12 నెలల రెంట్ అలవెన్స్) మొత్తం కాన్సర్డ్ స్కీం కింద రూ.11 లక్షల 56 వేలు నష్టపరిహారం అందుతుందని అన్నారు. అంతే కాక బిల్డింగ్ నిర్మాణ ఖర్చులను లెక్కించి అదనంగా అందజేస్తారని, దీనికి ఒప్పుకున్నట్లైతే 12 ఇండ్లకు సంబంధించి మొత్తం 20 మంది కుటుంబ సభ్యులు రతపూర్వకంగా సంతకాలు చేసి తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు. వీరు కాకుండా ఇంకెవరైనా అర్హులు ఉంటే ఆధార్ కార్డు, ఓటర్ కార్డు సమర్పించాలని సూచించారు. తప్పుడు ఆధారాలతో ప్రభుత్వ బెనిఫిట్స్ పొందాలని చూస్తే చీటింగ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బాధిత రైతులు ఆందోళనకు దిగారు.

నష్టపరిహారంపై అసంతృప్తి..

ఏళ్ల తరబడి నివాసముంటున్న ఇండ్లను తాము వదులుకోలేమని, మార్కెట్ రేటుకు తగ్గట్టుగా నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే ఇల్లుకు బదులు ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి మూడు సార్లు గ్రామ సభ నిర్వహించి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, మామునూరు సీఐ రమేష్ పాల్గొన్నారు.


మాకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి..



నాకు నాలుగు గుంటల ఇంటి స్థలం ఉంది. దానికి బదులుగా వసంతపూర్ రోడ్డు పక్కన అంతే స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వాలి. అంతేతప్ప ఇతర ఏ బెనిఫిట్స్ వద్దు. భూమికి బదులు భూమి ఇస్తేనే సరి. లేకపోతే చావుకైనా సిద్ధమే.

- కత్తెరపల్లి లక్ష్మి, గాడిపెల్లి

న్యాయం చేయకపోతే ఊరుకోం..



మాకు పైసలు వద్దు ఏమీ వద్దు.. మమ్మల్ని ఇలా బతకనివ్వండి.. మా అమ్మ వృద్ధురాలు. ఈ ఇంట్లోనే తుది జీవితం గడపాలనుకుంటోంది. వేరే దగ్గర ప్రాణం పోతే ఆత్మశాంతించదు. మా ఇంటిలో ఉంటేనే మాకు సంతృప్తి.ఇతర ప్రాంతాలకువెళ్లలేం. బలవంతం చేస్తే ఆందోళనకు దిగుతాం.

- జిల్ల యాకమ్మ

ఏడూళ్ల ఏటి కష్టాలు తీరేనా?



2023 జూలైలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన కొండాయి బ్రిడ్జి, కొండాయి బ్రిడ్జి వద్ద జంపన్నవాగును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

- పడవ ప్రయాణమే శరణ్యం
- ప్రతి వర్షాకాలంలో తప్పని అవస్థలు
- రెండేళ్లయినా సాగని పనులు
- కొండాయి బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం
- కొట్టుకుపోయిన కొండాయి- దొడ్ల తాత్కాలిక రహదారి

ఏటూరునాగారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా వర్షాకాలం వచ్చిందంటే ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, దొడ్ల, మల్యాల, దొడ్ల కొత్తూరు, గోవిందరాజులకాలనీ, ఐలాపురం, ఎలిశెట్టిపల్లి గ్రామాల ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ఈ ఏడాదీ అదే దుస్థితి నెలకొంది. ఈ గ్రామ ప్రజలకు పడవ ప్రయాణమే ఏకైక శరణ్యంగా మారింది. రవాణా మార్గం లేక ప్రతి వర్షాకాలంలోనూ పడవ ప్రయాణమే వారికి దిక్కవుతోంది. రోడ్లు, బ్రిడ్జిలు లేకపోవడంతో వర్షాలు మొదలవగానే జలమయమయ్యే వాగులు, వంకలను దాటడానికి స్థానికులు పడవలపై ఆధార పడక తప్పడం లేదు. ఇది కేవలం ప్రయాణ సౌకర్య సమస్య మాత్రమే కాదు, ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదకరమైన ప్రయాణం. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి సరైన రవాణా సదుపాయం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పడవ ప్రయాణాల్లో అనేక ప్రమాదాల ఘటనలూ చోటు చేసుకున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఈ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు ప్రభుత్వం వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. కొండాయి బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో దొడ్ల-మల్యాల మధ్య తాత్కాలిక రహదారి కూడా అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. మట్టి రోడ్డు ధ్వంసమై వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకుండా పోయింది. వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ గ్రామాలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. 2023 జూలైలో వచ్చిన భారీ వరదలకు కొండాయి-దొడ్ల గ్రామాల మధ్యనున్న జంపన్నవాగు ఉప్పొంగి, కొండాయి హైలెవల్ బ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ విషాద ఘటనలో ఎనిమిది మంది జలసమాధి అయ్యారు. ఆ జ్ఞాపకాలు గిరిజనుల గుండెల్లో గుబులు రేపుతోంది. జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నా అవి ఈ ఏడాది పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ వర్షాకాలంలోనూ తమకు పడవ ప్రయాణం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా బ్రిడ్జి పనులను పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజలకు తప్పని రవాణా తిప్పల

ఏడు గ్రామాల ప్రజలకు మరోసారి రవాణా కష్టాలు మొదలయ్యాయి. రహదారులు అధ్వానంగా మారడంతో దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి నెలకొంది. వైద్య సేవలు, నిత్యావసరాల కొనుగోళ్లు, విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఎదురువుతున్న ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

కొండాయి-దొడ్ల గ్రామాల మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

జంపన్నవాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మట్టి రోడ్డు బురదమయంగా మారి, వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. పాదచారులు సైతం నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా వీడని భయాందోళన

2023 జూలైలో వచ్చిన భారీ వరదలకు కొట్టుకుపోయిన కొండాయి హైలెవెల్ బ్రిడ్జి దుర్ఘటన తాలూకు భయాందోళనలు స్థానికులను ఇంకా వెంటాడుతున్నాయి. జంపన్నవాగు ఉప్పొంగినప్పుడు బ్రిడ్జి కొట్టుకుపోయి వాగులో ఎనిమిది మంది మరణించిన విషాద ఘటనను మర్చిపోలేకపోతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన వారిని నిద్రపట్టనీయడం లేదు.

బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం ఎందుకు ?

జంపన్నవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో జాప్యం చోటు చేసుకోవడం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కొట్టుకుపోయిన కొండాయి హైలెవెల్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి సీతక్క ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ. 16.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ డ్రిల్లింగ్ పనులకు వెనుకంజ వేశారు. ఈ వంతెన పనులు పూర్తి కావాలంటే ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉందని, అవి ఈ ఏడాది పూర్తయ్యే అవకాశం లేదని పలువురు అంటున్నారు. కొత్త బ్రిడ్జి త్వరగా పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఆశించిన ప్రజలకు, పనుల్లో జాప్యం నిరాశను మిగులుస్తోంది. బ్రిడ్జి పనులు నత్తనడకన సాగడం వల్ల ఈ ఏడాది కూడా రవాణా కష్టాలు తప్పవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఉచిత ప్రమాద బీమా

- ఎరువులు కొనుగోలు చేసిన వారికి ఇఫ్కో కంపెనీ కానుక
- రూ. 10 వేల నుంచి 2 లక్షల వరకు సౌకర్యం

వరంగల్ వ్యవసాయం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం చెమట చిందించే రైతన్నకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఇఫ్కో కంపెనీ సంకటహరణ పేరుతో ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఎలాంటి అదనపు చార్జీలు, ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా కేవలం ఆ కంపెనీ ఎరువులు కొన్నవారందరికీ ఈ బీమా వర్తిస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఫ్కో కంపెనీ వరంగల్ జిల్లా మేనేజర్ విశాల్ కోరుతున్నారు.

ఎరువులు కొంటే... బీమా

సహకార సంఘాలు లేదా దుకాణాలలో కొనుగోలు చేసే ప్రతీ ఎరువు బస్తా, లేదా నానో ఎరువు బాటిల్‌పై రూ.10 వేల బీమా వర్తిస్తుంది. అయితే దీనికి అత్యధికంగా రూ.2లక్షల వరకు పరిమితి విధించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే వందశాతం, రెండు అవయవాలు కోల్పోతే 50శాతం, ఒక అవయవం కోల్పోతే 25శాతం బీమా లభిస్తుంది. కొనుగోలు చేసిన నెల రోజుల నుంచి 12 నెలల వరకు ఈ ప్రయోజనం పొందవచ్చు. రోడ్డు ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాము కాటు, గ్యాస్ సిలిండర్ పేలిపోవడం, అగ్నిప్రమాదాలు, యంత్రాల వల్ల కలిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, ఆత్మహత్యలకు వర్తించదు.

నిబంధనలు పాటించాలి..

రైతులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. రశీదుపై కొనుగోలుదారుడి పేరు, తండ్రి పేరు లేదా భర్త పేరు, తేదీ, చిరునామా, కొనుగోలు చేసిన ఇఫ్కో ఎరువుల సంఖ్య, నామినీ పే రు, కొనుగోలుదారుడి సంతకం, వేలిముద్ర ఉండాలి. రశీదుతో పాటు కొ నుగోలు వివరాల ధ్రువీకరణకు విక్రయాల రిజిస్టర్ నకలు పత్రం, పోలీ స్టేషన్‌లో కేసు నమోదైన ఎఫ్ఐఆర్ కాపీ, వైద్యుడి చికిత్స నివేదిక, పోస్టుమార్టం నివేదిక, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. క్లైమ్ ప త్రాలను ప్రమాదం సంభవించిన తేదీ నుంచి 2నెలల్లోగా సికింద్రాబాద్‌లోని ఇఫ్కో టోకియోసాధారణ బీమాకంపెనీలిమిటెడ్‌కు పంపించాలి.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రత్యేక ఆకర్షణ బతుకమ్మ కుంట

జనగామ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా బతుకమ్మ కుంటను తీర్చిదిద్దుతామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని బుతకమ్మకుంటలో చేస్తున్న అభివృద్ధి పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బతుకమ్మకుంట అభివృద్ధి పనులకు రూ.1.50కోట్లు మంజూర య్యాయన్నారు. అన్ని హంగులతో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

27న లైసెన్స్ సర్వేయర్ల అర్హత పరీక్ష

ఈనెల 27న లైసెన్స్ సర్వేయర్ల అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 27న జిల్లా కేంద్రంలోని ఏబీవీ కళాశాలలో జరిగే లైసెన్స్ సర్వేయర్ల అర్హత పరీక్షకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. ఉదయం 10నుంచి సాయంత్రం 3వరకు జరిగే ఈ పరీక్షకు మొత్తం 173 మంది హాజరఅవుతారని తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో సరిత

చిలుపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకందించే భోజనం మెనూ విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో సరిత సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రాజవరం సమీపంలోని కేజీబీవీ (కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం)ని తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. వంటగది, డైనింగ్ హాల్‌తోపాటు, తరగతి గదులు, మూత్రశాలల నిర్వహణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. సరిత మాట్లాడుతూ ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని అరికట్టేందుకు త్వరితగతిన సీసీ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రహరీ, అసంపూర్తి గదులను పూర్తి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని పీఆర్ ఏఈ శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎస్‌వో ప్రశాంతి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టమైన రంగంలో ఎదగాలి



మాట్లాడుతున్న రచయిత్రి రమాదేవి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల, కళాశాల దశలోనే ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని కష్టపడి ఎదగాలని ప్రముఖ రచయిత్రి, కవయిత్రి నెల్లుట్ల రమాదేవి అన్నారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సమావేశంలో మాట్లాడారు. ఎదగాలని లక్ష్యం, కల ఉన్న వారు దానికి అనుగుణంగా సమయం కేటాయించుకుని క్రమశిక్షణతో శ్రమను ఇష్టంగా చేసుకుని కృషి చేయాలన్నారు. చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. పాఠ్యాంశాలతోపాటు తెలుగు సాహిత్యంపై అభిరుచిని పెంచుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఈవో కొమురయ్య, పిన్సిపాల్ డాక్టర్ ఎ. వేణుగోపాల్ రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్, ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, లక్పతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను విరివిగా నాటాలి



మాదారంలో మొక్కను నాటుతున్న నరేష్

రఘునాథపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను విరివిగా నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ ఎస్‌ఐ కె.నరేష్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపూర్, మాదారం గ్రామాల్లో ఎక్సైజ్ సిబ్బందితోపాటు కల్లు గీత కార్మికులు శుక్రవారం వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది దస్తగిరి, సలీం, కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు బాల్నే సోమయ్య, బురుగు శంకరయ్య, ఉమ్మగోని శ్రీహరి, బాల్నే గట్టుమల్లు, ఉమ్మగోని నర్సయ్య, మల్లయ్య, భిక్షపతి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఉమ్మగోని సరిత పాల్గొన్నారు.

జిరాక్స్ మెషిన్, ప్రింటర్ అందజేత



చిలుపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నపెండ్యాల జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1982-83లో ఏడో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు జిరాక్స్ మెషిన్, ప్రింటర్‌ను శుక్రవారం అందజేశారు. పూర్వ విద్యార్థులు చిలుపూర్ గుట్ట మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్, పాగాల వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధికి అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుడిమళ్ల సంపత్, ప్రభాకర్, రబ్బాని, శ్రీనివాస్, మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, స్వామి, శ్రీనివాస్, అశోక్, రవికుమార్ పాల్గొన్నారు.

శ్రావణం..శుభకరం..



● ఇక అన్నీ మంచి రోజులే.. ● ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు ● మోగనున్న పెళ్లి బాజాలు ● కిటకిటలాడనున్న ఆలయాలు

బచ్చన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం వర్ష రుతువుతో పరిసరాలు పచ్చగా కళకళలాడే కాలం. ఇళ్లన్నీ పూజాదికాలతో శోభిల్లే కాలం. ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాధాన్యతమైనది. ఈమాసం శివ కేశవులతోపాటు పార్వతీదేవికి, శ్రీమహాలక్ష్మీకి ప్రీతికరమైనదిగా భావిస్తారు. శ్రావణ మాసం ఆరంభం కావడంతో పట్టణాలు, పల్లెల్లో శుభకార్యాలకు తెర లేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులు ముగ్గులు పోసుకునేందుకు మంచి ఘడియల కోసం నెల రోజులకు పైగా వేచి చూశారు. అధికారులు ఎంతగా ఒత్తిళ్లు చేసినా ముహూర్తం లేదంటూ ముగ్గులు పోసేందుకు నిరాకరించారు. శ్రావణమాసం మొదటి రోజు నుంచే పల్లెల్లో ముగ్గులు పోసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బచ్చన్నపేట మండలంలో 531 ఇళ్లకు గాను 95 ఇళ్లకు మాత్రమే ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. ఈ వారం రోజుల్లో దాదాపుగా 90 శాతం ముగ్గులు పోసే కార్యక్రమం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.



పెళ్లిళ్ల సందడి..

శ్రావణ మాసం అంటే పెళ్లిళ్ల ముహూర్తాలు అధికంగానే ఉన్నాయి. గత రెండు నెలలు సుముహూర్తాలు లేకపోవటంతో శ్రావణమాసం కోసం ఎదురుచూశారు. ఆషాఢంకు ముందే వివాహ ముహూర్తాలు కుదుర్చుకుని, పెళ్లి మండపాలను చాలా వరకు బుక్ చేసుకున్నారు. ఈనెల 26, 30, 31 తేదీలతో పాటు ఆగస్టు నెల 1, 3, 5,7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీల్లో జిల్లాలో వేలాది పెళ్లిళ్లు జరగనున్నాయి. అలాగే జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలతో పాటు గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. అభిషేకాలు, మహిళలచే వరలక్ష్మీ వ్రతాలు, సత్యనారాయణ వ్రతాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి.

పవిత్రమైనది శ్రావణమాసం

ముకేష్ శుక్లా, పూజారి దత్తాత్రేయ ఆలయం, కొడవటూరు



హిందూ సంప్రదాయాల్లో శ్రావణమాసం అత్యంత పవిత్రమైనది. వేదపారాయణాలు, వ్రతాలు, పూజలు, శివారాధనకు అనుకూలమైన మాసం. సిరి, సంపదలు ప్రసాదించాలని మహాలక్ష్మీ అమ్మవారిని మహిళలు భక్తిశ్రద్ధలతో కొలుస్తారు.

శ్రావణ సందడి

జనగామ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస మొదటి శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనగామలోని గుండ్లగడ్డ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. శ్రీ ఆంజనేయ సహిత సంతోషిమాత దేవాలయంలో ఆలయ ప్రధానార్చకులు పార్నంది శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.



ఉమామహేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎరువుల షాపుల తనిఖీ



షాపులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ డి.నరేష్

రఘునాథపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఎస్‌ఐ డి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. షాపులలోని రిజిస్టర్‌లను పరిశీలించడంతోపాటు ఎరువులను స్టాక్ చేసే గోదాములను సందర్శించి స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌లను, స్టాక్ వివరాలతో కూడిన బోర్డులను రైతులకు తెలిసేటట్టు అందుబాటులో ఉంచాలని ఫర్టిలైజర్ షాపుల యాజమానులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ చేస్తే కఠినచర్యలు



పాలకుర్తిలో సీఐ దుకాణాల తనిఖీ

పాలకుర్తి(ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు యూరియాను బ్లాక్ చేస్తే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని సీఐ జానకీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయాధికారుతో కలిసి సీఐ జానకీరాంరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను రైతులకు విక్రయి ంచ కుండా బ్లాక్ చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అదే విధంగా అధిక ధరలకు యూరియాను విక్రయిస్తే ఫర్టిలైజర్ యాజమానులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై పవన్‌కుమార్, ఏఈవో రాధిక ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మహాలక్ష్మి కుటుంబానికి గుంటి కుటుంబం ఆర్థికసాయం

తరిగొప్పుల, జూలై 25(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌కు చెందిన నిరుపేద మహిళ పల్లె మహాలక్ష్మి(38) అనారోగ్యంతో బాధపడుతూ కనీసం వైద్యం చేసుకోలేని పరిస్థితిలో గురువారం మృతిచెందింది. గ్రామానికి చెందిన గుంటి బ్రదర్స్ అండ్ ఫ్యామిలీ మహాలక్ష్మి మృతివార్తను తెలుసుకుని బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గుంటి వారి కుటుంబ సభ్యులు, పల్లే సంజయ్, యాదగిరి, అయోధ్య, నరేష్, బత్తిని జగన్, కమల్‌హాసన్ పాల్గొన్నారు.

● జఫర్‌గడ్(ఆంధ్రజ్యోతి) : తిడుగులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు చందా రాజు కుటుంబాన్ని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు శుక్రవారం పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, నాయకులు కత్తి సందీప్, చీరబోయిన కవిత, ముస్కు స్వప్న, నర్సింగోజు స్వామి, కార్తీక్, రవి, పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి ఇటీవల మృతి చెందిన తాళ్లపల్లి అశోక్‌బాబుగౌడ్ (59) కుటుంబానికి బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఇనుగాల సంపత్ రెడ్డి శుక్రవారం రూ.5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఒగ్గు రాజు, మాదిరెడ్డి కరుణాకర్ రెడ్డి, చాడ శివారెడ్డి, ఎమ్డీ అన్వర్‌పాషా, ఎస్‌కే సలీం, కలకోల నరేందర్, ఇనుగాల మహేశ్వర్ రెడ్డి, జాలిగపు నాగరాజు, కలకోల అనిల్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తాళం తీసిన రైతు



స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నెమలిగొండకు చెందిన రైతు పెద్దపూండ్ర రవీందర్ రెడ్డి ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేయగా, శుక్రవారం పోలీసులు, విద్యుత్‌శాఖాధికారులు అక్కడికి చేరుకుని తీయించారు. రైతు రవీందర్ తన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలంటూ కొద్ది రోజులుగా అధికారులను కోరుతున్నాడు. దాన్ని తొలగించాలంటే అందుకు ఖర్చులు భరించాలని అధికారులు వెల్లడించారు. దీంతో కరెంట్ ఉపయోగించుకునే ఇతర రైతులు ఆ ఖర్చులను భరించాలని కోరారు. ఈ క్రమంలో గురువారం రవీందర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేశాడు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇతర రైతులు పోలీసులను ఆశ్రయించారు. విద్యుత్ అధికారులు, పోలీసులు స్పందించారు. పోలీసుల సమక్షంలో రైతుకు నచ్చజెప్పడంతో తాళం తొలగించాడు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శివకుమార్ పాల్గొన్నాడు.

28న ఏసీ రెడ్డి వర్ధంతి సభ

జనగామ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జనగామలో 28న నిర్వహించే ఏసీ రెడ్డి నరసింహరెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి పిలుపునిచ్చారు. జనగామలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కనకరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఏసీ రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జోగు ప్రకాశ్, సాంబరాజు యాదగిరి, పుత్కనూరు ఉపేందర్, దాసగొని సుమ, సౌందర్య పాల్గొన్నారు.

28న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు 28న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్, మెన్, ఉమెన్ విభాగాల్లో జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీస్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. వివరాలకు 98850 46437 నంబరులో సంప్రదించాలన్నారు.

గోదాంలో పాము..భయంలో హమాలీలు



స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని గోదాంలో శుక్రవార నాగుపాము రావడంతో భయపడి పోయారు. మార్కెట్ ఆవరణలోని గోదాంలో నిల్వచేసిన మక్కల సంచులను లారీలో లోడ్ చేసేందుకు హమాలీలు తీస్తున్న క్రమంలో సంచుల మధ్య నాగుపాము బుసలు కొడుతూ ఒక్కసారిగా పైకి రావడంతో హమాలీలు భయపడిపోయారు. స్నేక్ క్యాచర్ రమణాకర్‌కు సమాచారం అందించగా, నాగుపామును పట్టుకొని శివారులోని చెట్ల పొదాల్లో వదిలేశాడు. దీంతో హమాలీలు ఊపిరి పీల్చుకున్నారు.



నర్మెట జీపీలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో స్వరూప

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నర్మెట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్.స్వరూప సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం జీపీ అధికారులు, వైద్యాధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వీధుల్లో చెత్తచెదారం, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. నెలలో 1న, 11న, 21న క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరవింద్, పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్‌కిరణ్, కార్యదర్శి శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘణపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): బండ్లగూడెంలోని కేజీబీవీలో స్కావెంజర్ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసే స్కావెంజర్ పోస్టుకు 7వతరగతి పాసైన లింగాలఘణపురం మండలానికి చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులను తెలిపారు. వివరాలకు 8179985886 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కృత్రిమ కాలు ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న నాగపురి కిరణ్

జనగామ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ కృత్రిమ కాలు ఎల్‌వోసీ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. జనగామలోని 15వ వార్డు సంజయనగర్‌కు చెందిన రాస మహేందర్‌కు రోడ్డు ప్రమాదంలో కుడికాలుకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు కాలును తొలగించారు. విషయం తెలుసుకున్న నాగపురి కిరణ్ కృత్రిమకాలు ఏర్పాటుకు రూ.1,25,000 మంజూరు చేయించి శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేశాడు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.

తేలిన ఓటర్ల లెక్క

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. జనగామ నియోజకవర్గంలో 25, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 19, పాలకుర్తిలో 17పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయాల్సి ఉంటుందని నిర్ణయించా రు. కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పోలింగ్ సమయంలో ఓటర్లకు కలిగే అసౌకర్యాన్ని తప్పించే అవకాశం ఉంటుంది. జనగామ నియోజకవర్గంలో 277 పోలింగ్ కేంద్రాలు ఉండగా పెరిగిన వాటితో 302, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 290 ఉండగా 309, పాలకుర్తిలో 294 ఉండగా పెరిగిన వాటితో 311 పోలింగ్ కేంద్రాలు కానున్నాయి. మొత్తంగా ప్రస్తుతం పోలింగ్ కేంద్రాలు 861 కాగా పెరిగే వాటితో కలిపి 922కు అవుతాయి.

త్వరలోనే ప్రత్యేక సమగ్ర సవరణ

నకిలీ ఓటర్లను తొలగించి, అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చడం కోసం దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ-26 కార్యక్రమాన్ని చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. బీహార్‌లో ఈ ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికల ఉం డడంతో ఆ రాష్ట్రంలో ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీహార్‌లో అక్రమంగా వలస వచ్చి ఓటర్లుగా నమోదైన బంగ్లాదేశీయులను గుర్తించడంలో భాగంగానే అక్కడ ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టారన్న ప్రచారం జరుగుతోంది. కాగా.. ఇదే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయిచింది. వచ్చే ఏడాది జనవరి 1 నాటి 18ఏళ్లు నిండే వారందరినీ ఓటర్లుగా గు ర్తించాలని ఈసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా బూత్ స్థాయిలో ఇంటింటి సర్వే ద్వారా నకిలీ ఓటర్లను గుర్తించడంతో పాటు అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చాలని ఈసీ భావిస్తోంది. దీనికి సంబంధించిన ఆదేశాలను విడుదల చేయగా పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

(5వ పేజీ తరువాయి)

సరిపడా పెట్టుకోవాలని ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకొనిరావాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మల్లికార్జున రావు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యపర్చాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రత్యేకాధికారి వాసం వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని ఏఎన్ఎంలు సిబ్బంది అధికారులకు తెలియపర్చాలన్నారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి, అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని సూపరింటెండెంట్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సృజనను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల డెంగీ బారిన పడిన ఇటుకాలపల్లిలోని పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మల్లిఖార్జున్, ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్‌కుమార్, కమల్‌హాసన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంవో శ్రీనివాస్

పుస్తక పఠనం అలవాటు చేయాలి

రఘునాథపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలని జీసీడీవో గౌసియా బేగం, ఏఎంవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలోని 50శాతం మంది ఉపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన మొదటి కాంప్లెక్స్ సమావేశానికి కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ఉపేంద్రం అధ్యక్షత వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతుల పిల్లలకు రాయడంలో కన్న చదవడంలో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, రెండు నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు చదవడానికి టెక్స్ట్ బుక్స్‌తో పాటు లైబ్రరీ బుక్స్‌ను ఎక్కువగా ఉపయోగించుకునేటట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రఘునందన్ రెడ్డి, ఆనంద్ కుమార్, సీఆర్పీ కనకయ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న జగదీష్ చందర్ రెడ్డి

రఘునాథపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపూర్‌లో సుప్రజ హాస్పిటల్ నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, చెవులు వినపడని వారికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గొట్టం భాస్కర్ రెడ్డి, హయత్ ఆలీ, గాజులపాటి మహేందర్, షబ్బీర్ మియా, వీరోజీ, సుప్రజ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం కార్యదర్శిగా కృష్ణ



జఫర్‌గడ్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా జఫర్‌గడ్ మండల కేంద్రానికి చెందిన తిప్పరబోయిన కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు రాము శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి చేస్తున్న కృషిని గుర్తించి తనను జిల్లా సహాయ కార్యదర్శిగా నియమించిన సంఘం జిల్లా అధ్యక్షుడు, సహకరించిన జిల్లా కమిటీ ప్రతినిధులు, మండల ఫొటో గ్రాఫర్లకు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.